



కుప్పం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఎన్నికల అధికారి, పరిశీలకుల సీట్లు - కౌన్సిలర్ల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

కుప్పం మున్సిపల్ చైర్మన్ కుర్చీ ఎవరిదో?

కుప్పం మున్సిపల్ చైర్మన్ కుర్చీ గెలుచుకోవడానికి అధికార, ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. చైర్మన్ కుర్చీ తమదేనన్న ధీమా టీడీపీలో కనిపిస్తోంది. అంత ఈజీగా వదులుకోకూడదన్న పట్టుదల వైసీపీలోనూ కనిపిస్తోంది. మరోవైపు చైర్మన్ ఎన్నిక సోమవారం నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఆదివారం పూర్తి చేసింది. కుప్పంలో అంతా ప్రశాంతంగా ఉన్నట్టే కనిపిస్తోంది కానీ, ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

నేడే ఎన్నిక ● తమదేనని టీడీపీలో ధీమా ● అంత ఈజీ కాదంటున్న వైసీపీ

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య జరగనుంది. 22వ తేదీన ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో అధికార, ప్రతిపక్షాలు రెండూ ఆ పదవిని కైవసం చేసుకోవడానికి రంగంలో దిగాయి. వైసీపీకి టాటాచెప్పి టీడీపీలో చేరిన డాక్టర్ సుధీర్ తన మున్సిపల్ చైర్మన్ పదవితోపాటు 16వ వార్డు నుంచి గెలుచుకున్న కౌన్సిలర్ పదవికి కూడా గతేడాది నవంబరు 6వ తేదీన రాజీనామా చేశారు. అప్పటినుంచి మున్సిపల్ చైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. మున్సిపాలిటీలో 25 వార్డులుండగా, 16వ వార్డు ఖాళీ కావడంతో 24 మంది కౌన్సిలర్లే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్టీ తరఫున గెలిచినవారు ఆరుగురు, తర్వాత పార్టీలో చేరిన నలుగురితో కలిపి అధికార టీడీపీకి 10 మంది కౌన్సిలర్లు, వైసీపీకి 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఈ 24 మంది కౌన్సిలర్లకు కాక టీడీపీ, వైసీపీ ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భరత్‌లకు, స్థానిక ఎమ్మెల్యే కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఓటు హక్కు ఉంది. ఈ ప్రకారం తీసుకుంటే సభ్యుల సంఖ్య మొత్తం 27 అవుతుంది. ప్రత్యేక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, ఎన్నిక జరపడానికి కోరం కావాలంటే 14 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉంటుంది.

శిబిర రాజకీయాలు

ప్రలోభాలకు గురికాకుండా ఉండడానికి అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ దాదాపు నాలుగైదు రోజుల నుంచి తమ పార్టీలకు చెందిన కౌన్సిలర్లను ఇతర రాష్ట్రాల్లోని ప్రత్యేక శిబిరాలకు తరలించాయి. ఆయా శిబిరాల్లో కౌన్సిలర్లు మహారాజ భోగం అనుభవిస్తున్నారు. అయితే టీడీపీ అధికారంలో ఉండడంతో కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు సహజంగానే అటువైపు మొగ్గారు. ప్రస్తుతం టీడీపీ శిబిరంలో ఆ పార్టీకి చెందిన 10 మంది కౌన్సిలర్లతోపాటు వైసీపీ కౌన్సిలర్లు ముగ్గురు కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కోరం ఉండాలంటే అధికార పార్టీకి ఇంకో కౌన్సిలర్ అవసరమవుతారు. ఆదివారం రాత్రికి మరో ఇద్దరు ముగ్గురు కౌన్సిలర్లనైనా శిబిరంలో చేర్చడానికి, లేదా నేరుగా కౌన్సిల్ సమావేశానికి వచ్చి తమ అభ్యర్థికి ఓటు వేయడానికి టీడీపీ నాయకులు చేస్తున్న ముమ్మర ప్రయత్నాలు దాదాపు ఫలించే అవకాశం ఉందంటున్నారు. వైసీపీ కూడా చైర్మన్ కుర్చీని అంత తేలిగ్గా వదిలేయదలచుకోలేదు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆ పార్టీ కూడా కౌన్సిలర్లతో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తోంది. మరోవైపు తమకు ప్రొటెక్షన్ కావాలంటూ ఎమ్మెల్సీ భరత్‌తోపాటు కొందరు ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్లు హైకోర్టుకు వెళ్లి ఆ ప్రకారం ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఓవైపు శిబిరంలో ఉన్నవారేకాక, మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు కుప్పంలోనే తిరుగుతున్నారు.

ఎన్నికకు సర్వం సిద్ధం

చైర్మన్ ఎన్నిక కోసం కుప్పం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలును ఆదివారం అధికారులు సిద్ధం చేశారు. మున్సిపల్ కమిషనర్ వి.వెంకటేశ్వర రావు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారిగా కుప్పం ఆర్డీవో వెంకటేశ్వర రాజు, పరిశీలకులుగా జేసీ విద్యాధరి వ్యవహరిస్తారు. ఇక డీఎస్పీ పార్థసారథి, కుప్పం అర్బన్ సీఐ శంకరయ్యలు శాంతిభద్రతలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నిక జరిగే సమావేశపు హాలుకు వంద మీటర్ల దూరం వరకు 163 సెక్షన్ అమల్లో ఉంటుందని డీఎస్పీ తెలిపారు. దీనివల్ల ఇక్కడ స్థానికులకు తప్ప, బయటి వారికి అనుమతి లేదని చెప్పారు. ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలతోపాటు మొత్తం వంద మంది పోలీసు బలగాలను నియమించారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

చంద్రబాబు నిర్ణయమే ఫైనల్

టీడీపీలో మున్సిపల్ చైర్మన్ కుర్చీకోసం ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న వాల్మీకి బోయ సామాజిక వర్గానికి చెందిన 19వ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము, బలిజ సామాజిక వర్గానికి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ ఎస్.సోమశేఖర్ మధ్య ఈ పోటీ మరీ తీవ్రంగా ఉంది. 5వ వార్డు కౌన్సిలర్ వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన సెల్వరాజ్ కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు. చివరికి ఈ విషయంలో పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయమే ఫైనల్ అని అందరూ అంగీకరిస్తున్నారు. ఆయన కరుణ ఎవరిపై ఉందో ప్రస్తుతానికైతే ఎవరికీ తెలియదు. మరోవైపు వైసీపీలో చూడడానికి తీవ్రంగా పోటీ పడుతున్నట్టు అనిపిస్తున్నా, ఆ పార్టీలో చైర్మన్ కుర్చీ సొంతం చేసుకుంటామన్న నమ్మకం పెద్దగా ఉన్నట్టు కనిపించడం లేదు. ఆ పార్టీనుంచి మొదటినుంచి ఈ పోటీలో ఉన్నట్టు వినిపిస్తున్న ప్రస్తుత మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ ఆ పదవికి రాజీనామా చేయకపోవడమే దీనికి ఉదాహరణ. మున్సిపల్ చైర్మన్‌గా పోటీ చేయాలంటే వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేసి తీరాలి. మరొకరి పేరు చెబుతున్నారు కానీ, అంత బలంగా వినిపించడంలేదు.

టీడీపీలో ముందస్తు విజయోత్సాహం

కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి టీడీపీలో ముందస్తు విజయోత్సాహం కనిపిస్తోంది. విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి కుప్పం తరలిరావాలంటూ పార్టీ శ్రేణులకు ఆదివారం అంతర్గతంగా నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికకు రెండు గంటల ముందే అంటే సోమవారం ఉదయం తొమ్మిది గంటలకంతా పంచాయతీకి 50 మంది చొప్పున కుప్పంలోని పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. దీంతో చైర్మన్ ఎన్నికల్లో టీడీపీ విజయం తప్పదన్న ధీమా పార్టీ శ్రేణుల్లో ఏర్పడింది. మరోవైపు వైసీపీ కూడా తమ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ భరత్ పిలుపునిచ్చారు. కుప్పం పట్టణంలోని మండల సచివాలయం సమీపంలోని ఏడీఎస్ సూపర్‌బజార్ వద్దకు చేరుకోవాలని పార్టీ సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు పెట్టారు.

బాబోయ్.. ఎండలు!



బోసిపోయిన చిత్తూరు గాంధీ సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం తవణంపల్లెలో 40.3, శ్రీరంగరాజపురంలో 39.6 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాలవారీగా.. గుడిపాలలో 38.2, చిత్తూరులో 38.1, గంగాధరనెల్లూరులో 38, బంగారుపాళ్యంలో 37.9, యాదమరిలో 37.8, పూతలపట్టు, పులిచెర్ల, వెదురుకుప్పంలో 37.4, గంగవరం, పెద్దపంజాణిలో 37, సదుంలో 36.7, చౌడేపల్లె, ఐరాల, నగరి, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురంలో 36.6, సోమలలో 36.5, రొంపిచెర్లలో 36.3, కార్వేటినగరంలో 36.2, గుడుపల్లె, శాంతిపురంలో 35.6, పలమనేరులో 35, కుప్పంలో 34.7, వి.కోటలో 34.5, బైరెడ్డిపల్లెలో 34.4, పుంగనూరులో 33.6, రామకుప్పంలో 33.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పలమనేరులో నేడు 'పీజీఆర్ఎస్'

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్న కలెక్టర్, జేసీ

కలెక్టరేట్‌లో కార్యక్రమం రద్దు

పలమనేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తనతోపాటు జేసీ విద్యాధరి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అందువల్ల కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.

పోలీసు కార్యాలయంలో యథావిధిగా..

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు.

వి.కోట పంచాయతీలో రూ.50 లక్షల దుర్వినియోగం

● ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

● కాంట్రాక్టు ఉద్యోగిపై ఎఫ్ఐఆర్ నమోదుకు డీపీవో ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వి.కోట పంచాయతీలో రూ.50 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయి. దీనికి కారకులైన ఇద్దరు ఉద్యోగులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో డీపీవో సుధాకర్ రావు శనివారం రాత్రి సస్పెండ్ చేశారు. పొలకల పంచాయతీలో ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాదవపతి గతంలో డిప్యుటేషన్‌పై వి.కోట పంచాయతీ ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వహించారు. అతడితోపాటు అప్పటి బిల్ కలెక్టర్ పృథ్వి, మరో కాంట్రాక్టు ఉద్యోగితో కలిసి ప్రజలు చెల్లించిన పన్నులు, పన్నేతర నిధులను పంచాయతీ ఖాతాల్లో జమచేయకుండా రూ.1.50 కోట్లు దుర్వినియోగం చేసినట్లు అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్పీవోస్థాయి అధికారి ప్రాథమిక విచారణ చేశారు. రూ.50 లక్షలు పక్కదారి పట్టినట్లు నిర్ధారించారు. ఇందులో యాదవపతి రూ.16లక్షలు, పృథ్వి రూ.13 లక్షలు వారి సొంతానికి వాడుకున్నట్లు తేలింది. దీంతో రూ.10లక్షలు వారు పంచాయతీ ఖాతాకు జమచేశారు. మిగిలిన మొత్తాన్ని చెల్లించకపోవడంతో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కారణంగా ఇద్దరినీ సస్పెండ్ చేసినట్లు డీపీవో వివరించారు. ఇదే కేసులో బాధ్యుడిగా గుర్తించిన మరో కాంట్రాక్టు ఉద్యోగిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శికి డీపీవో ఆదేశాలిచ్చారు.

30న జరగాల్సిన 'డీఆర్సీ' వాయిదా!

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జడ్పీ మీటింగ్ హాలులో ఈనెల 30వ తేదీన జరగాల్సిన జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశం వాయిదా పడినట్లు సమాచారం. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్ అధ్యక్షత వహించాల్సి ఉంది. కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే రెండో తేదీన రాజధానికి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వస్తున్న నేపథ్యంలో మంత్రి రాంప్రసాద్‌తోపాటు పలువురు మంత్రులను ఏర్పాట్ల పర్యవేక్షణకు సీఎం చంద్రబాబు నియమించారు. ఇన్‌చార్జి మంత్రి బిజీగా ఉన్న దృష్ట్యా డీఆర్సీ మీటింగ్‌కు రాలేనని సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో సమావేశం వాయిదా పడిందని తెలిసింది. అధికారిక ప్రకటన సోమవారం వెలువడే అవకాశం ఉంది.

డీసీసీబీలో విచారణ పూర్తి

వచ్చేనెల 15 తర్వాత ప్రభుత్వానికి నివేదిక

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో గత పాలకవర్గం చేసిన ఆర్థిక విధ్వంసంపై కొనసాగుతున్న సహకార చట్టం సెక్షన్ 51 విచారణ శుక్రవారంతో ముగిసింది. దీనిపై వచ్చేనెల 15 తర్వాత ప్రభుత్వానికి సమగ్ర నివేదిక కలెక్టర్ పేరిట పంపనున్నట్లు తాజాగా తెలిసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పటి బ్యాంకు చైర్‌పర్సన్‌గా ఎం.రెడ్డమ్మ కొనసాగగా, ఆరుగురు సింగిల్ విండో అధ్యక్షులు డైరెక్టర్లుగా పనిచేశారు. అప్పట్లో జరిగిన అవినీతి అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో గత ఏడాది జూన్ 11, 12, నవంబరు 13వ తేదీల్లో కథనాలు ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు గత పాలకవర్గం తప్పిదాలపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. దాంతో విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్‌ను విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఆయన ఈ ఏడాది మార్చి 21 నుంచి ఈనెల 25వ తేదీ వరకు బ్యాంకు ప్రధాన కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంపై 80 మందికి సమన్లు జారీచేశారు. విచారణకు బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ, ఆమె భర్త కృష్ణమూర్తి, మాజీ డైరెక్టర్లు బి.కరుణాకర్ చౌదరి, డి.హరినాథ రెడ్డి, టి.ఊరప్ప, షేక్ మస్తాన్ సాహెబ్, ఎం.బాలసుబ్రహ్మణ్యం, జి.అరుణమ్మ, చైర్‌పర్సన్ అప్పటి పీఏ సుధాకర్, అప్పటి బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, జీఎం లిల్లీ కేథరిన్, వివిధ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, సింగిల్‌విండో సీఈవోలు విచారణకు హాజరై తమపై వచ్చిన అభియోగాలకు వివరణలు ఇచ్చారు. వరదయ్యపాళెం సింగిల్‌విండో పరిధిలో 17 స్వయం సహాయక సంఘాల పేరిట వైసీపీ నాయకులు, కార్యకర్తలు.. బినామీ రూపంలో 2020-22 మధ్య రూ.1.30 కోట్ల రుణాలు పొందారు. అందరూ రూ.9లక్షలు చెల్లించగా, మిగతా పైకం వడ్డీతో కట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు ఇందుకు సంబంధించి 80మంది డ్వాక్రా సంఘం సభ్యులు విచారణకు హాజరవగా, మరో 90 మందిని మే ఒకటో తేదీన వరదయ్యపాళెంకు వెళ్లి డీఆర్వో విచారణ చేయనున్నట్లు సమాచారం.

మా బిడ్డ ఆత్మహత్యపై అనుమానాలున్నాయ్!





మృతదేహాన్ని చేతులపై పెట్టుకుని కళాశాల వద్దకు నడిచి వస్తున్న బాధితులు (ఇన్‌సెట్లో) రోడ్డుపై ధర్నా

మదర్ థెరీసా కళాశాల యాజమాన్యం సమాధానం చెప్పాల్సిందేనన్న కుటుంబీకులు

మృతదేహాన్ని చేతులపై పెట్టుకుని ఐదు కిలోమీటర్లు నడిచొచ్చి రోడ్డుపై ధర్నా

పోలీసుల జోక్యం, యాజమాన్యం హామీతో విరమణ

గంగవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): 'మా బిడ్డ యోగేష్ (16) ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయి. మదర్ థెరీసా కళాశాలయాజమాన్యం సమాధానం చెప్పాల్సిందే' అని కుటుంబీకులు పట్టుబట్టారు. మృతదేహాన్ని చేతులపై పెట్టుకుని ఐదు కిలోమీటర్లు నడిచొచ్చి కళాశాల ఎదుట ధర్నాకు దిగారు. చివరకు పోలీసుల జోక్యం, కళాశాల యాజమాన్యం ఇచ్చిన హామీతో ధర్నా విరమించారు. ఇంటర్ ఫెయిల్ అయ్యాడన్న మనస్తాపంతో శాంతిపురం మండలం గెసికపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం, ప్రభ దంపతుల కుమారుడు యోగేష్.. గంగవరం మండలం మదనపల్లె రోడ్డులో ఉన్న మదర్ థెరీసా కళాశాల హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. యోగేష్ మృతదేహానికి ఆదివారం పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేసి, కుటుంబీకులకు అప్పగించారు. అయితే తమ బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయని, కళాశాల యాజమాన్యం నివృత్తి చేశాకే స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్తామని కుటుంబీకులు తేల్చి చెప్పారు. ఈ సమయంలో మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించడానికి అభ్యంతరం లేదని, కళాశాల వద్దకు తీసుకెళ్లొద్దని పోలీసులు చెప్పడంతో అంబులెన్స్ నిర్వాహకులు ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో బాధితులు.. మృతదేహాన్ని చేతులపైనే పెట్టుకుని పలమనేరు ప్రభుత్వాస్పత్రి నుంచి కళాశాల వరకు సుమారు ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చారు. మధ్యాహ్నం 3.50 గంటల నుంచి కళాశాల ఎదుట రోడ్డుపై మృతదేహాన్ని ఉంచి.. బంధువులతో కలిసి తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. యోగేష్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదన్నారు. శనివారం ఉదయం ఫోన్ చేస్తే హాస్టల్‌లో లెమన్‌రైస్ తిన్నానని, చదువుకుంటున్నానని చెప్పాడన్నారు. సాయంత్రం ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని, కొంతసేపటికి స్పృహ తప్పి పడిపోయాడని స్నేహితులు చెప్పగా కళాశాల వద్దకు వచ్చామన్నారు. ఇక్కడికొస్తే ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పడంతో ఖంగుతిన్నామన్నారు. హాస్టల్ గదిలో ఉరేసుకుంటే యాజమాన్యం లేదా సిబ్బంది ఎందుకు సకాలంలో స్పందించలేదని మండిపడ్డారు. మేమొచ్చేలోపు ఎందుకు ఆస్పత్రికి తరలించారని, హాస్టల్‌లోని సీసీ కెమెరాలను చూపించాలని వేడుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. అందువల్ల తమ బిడ్డ మృతిపై అనుమానాలున్నాయని, కళాశాల యాజమాన్యం రోడ్డుపైకి వచ్చి సమాధానం చెప్పే వరకు కదిలేది లేదన్నారు. ఫీజు కట్టనిదే హాస్టల్‌లోనికి అనుమతించమని చెప్పిన యజమాన్యానికి తమ బిడ్డ ప్రాణాలను కాపాడే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. 'రోడ్డుపై ధర్నాకు దిగడంతో ట్రాఫిక్ స్తంభించింది. మీకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం చేస్తాం' అని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ ప్రసాద్ నచ్చజెప్పినా బాధితులు శాంతించలేదు. అనంతరం బాధితుల బంధువులు, పెద్ద మనుషులతో డీఎస్పీ ప్రభాకర్, ఎస్బీ సీఐ భాస్కర్ మాట్లాడి.. కళాశాల యాజమాన్యంతో చర్చించారు. యోగేష్ మృతికి కారణాలను వివరించి.. వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేయడంతోపాటు, మృతుడి సోదరులకు ఉచితంగా విద్య అందిస్తామని కళాశాల యాజమాన్యం హామీ ఇవ్వడంతో సాయంత్రం 6.50 గంటలకు ధర్నాను విరమించారు. ఏడు గంటలకు ప్రత్యేక అంబులెన్సులో యోగేష్ మృతదేహాన్ని వారి స్వగ్రామమైన గెసికపల్లెకు తరలించారు. కళాశాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు ప్రసాద్, నరసింహరాజు, రామ్‌భూపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.


'కుప్పం ఎయిర్‌పోర్టు' ప్రక్రియలో కదలిక

అదనపు భూసేకరణ పనులు ప్రారంభం

రామకుప్పం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అదనపు భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఉద్యాన పంటలకు ఆలవాలమైన కుప్పం నుంచి ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి వీలుగా శాంతిపురం, రామకుప్పం మండలాల మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌స్ట్రిప్ (చిన్నపాటి విమానాశ్రయం) ఏర్పాటు చేయాలని 2017లో టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో శాంతిపురం మండలం అమ్మవారిపేట, రామకుప్పం మండలం కిలాకిపోడు, కడిశినకుప్పం, వెంకటేశ్వపురం, మణీంద్రం, విజలాపురం గ్రామాల సమీపంలో 845 ఎకరాల భూసేకరణ చేసింది. రైతులకు అప్పట్లో ప్రభుత్వం నష్టపరిహారం కూడా చెల్లించింది. 2018 చివరలో సీఎం చంద్రబాబు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుకు శంకుస్థాపనా చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడటంతో ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుకు గ్రహణం పట్టింది. ప్రస్తుతం చంద్రబాబు సీఎం కావడంతో ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటులో కదలిక వచ్చింది. ఇక్కడ కార్గో ఎయిర్‌స్ట్రిప్‌తోపాటు డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి, కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఇందుకోసం అదనంగా 534 ఎకరాల భూసేకరణ చేపట్టాలని కూడా నిర్ణయించింది. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారుల నేతృత్వంలో ఒక బృందాన్ని కేంద్రప్రభుత్వం నియమించింది. అంతేకాకుండా రూ.1.92కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ బృందం గత ఏడాది నవంబరులోనే సేకరించిన భూములను పరిశీలించింది. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనువుగా ఉన్నట్టు వారు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. గతంలో ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటు కోసం రామకుప్పం మండలంలో 485 ఎకరాలు, శాంతిపురం మండలంలో 360 ఎకరాల భూములు సేకరించారు. ఎయిర్‌స్ట్రిప్‌తోపాటు డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు రామకుప్పం మండలంలో మరో 534 ఎకరాలు సేకరించాలని రెవెన్యూ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దాంతో శనివారం నుంచి భూముల సర్వేను అధికారులు చేపట్టారు.ఎయిర్‌పోర్టు కోసం భూములు ఇవ్వడానికి ఎటువంటి అభ్యంతరాలు రావడం లేదు. ఎకరా, రెండెకరాలున్న రైతులు మాత్రం తాము ఆ భూములనే నమ్ముకుని జీవిస్తున్నామని,సాధ్యమైనంత ఎక్కువ పరిహారం అందించి, ఆదుకోవాలని కోరుతున్నారు.



రామకుప్పం మండలం బొందలగుంట వద్ద సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు



"జీవితంలో ఇక సాధ్యం కాకపోవచ్చనే కోరిక, సాకారమైందనే సంతోషం కలుగుతూ ఉంది. ఫిలాసఫీలో పీజీ వల్ల చాలా సంతృప్తిని పొందాను. పీజీ కోర్సులో కొన్ని పుస్తకాలు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. జిడ్డు కృష్ణమూర్తి రాసిన 'నీవే ప్రపంచం', ఎస్.రాధాకృష్ణన్ 'ఇండియన్ ఫిలాసఫీ', టీఎంపీ మహదేవన్ రాసిన 'అద్వైత తత్త్వం', ఫ్రాంక్ థిల్లీ రాసిన 'పాశ్చాత్య తత్త్వశాస్త్ర చరిత్ర', ఓషో 'ధ్యానం', 'ప్రేమ' వంటి గ్రంథాలు చదివాను. జిడ్డు కృష్ణమూర్తి తత్త్వాన్ని చదివినప్పుడు చాలా సంఘర్షణకు లోనయ్యాను. 'దేవుడు అనే నమ్మకంతో సత్యాన్ని తెలుసుకోలేరు' అనడం.. గురుత్వాన్ని తిరస్కరించడం నన్ను బాగా ఆలోచింపజేశాయి."

ఏడు పదుల విద్యార్థి

ఎస్వీయూలో ఎంఏ ఫిలాసఫీ చదువుతున్న రాజేంద్ర బాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

'అప్పట్లో ఫలానా డిగ్రీ చేయాలనుకున్నాను.. పరిస్థితుల వల్ల ఆపేయాల్సి వచ్చింది.' అని విచార జ్ఞాపకాలను మనుమలతో పంచుకుంటూ ఉంటారు చాలా మంది. 'నా కోరిక తీరనే లేదు.. మీరైనా చదువుకోండి' అని సలహా కూడా ఇస్తుంటారు. ఈయన మాత్రం ఆ బాపతు కాదు. రిటైరయ్యాక కృష్ణా..రామా అనుకుంటూ గడిపేయాలని అనుకోలేదు. నలభై ఏళ్ల కిందట నిలచిపోయిన పీజీ చదువును ఏడు పదుల వయసులో కొనసాగిస్తున్నారు. అదీ ప్రయివేటుగా కాదు రెగ్యులర్ విద్యార్థిగా.

ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలో సైకిలు మీద దూసుకుపోతూ కనిపించే ఈయనను.. 'వ్యాయామం కోసం సైకిల్ తొక్కుతున్న పెద్దాయన' అనుకుంటారు చాలామంది.

లైబ్రరీలో పుస్తకాలు వెతుక్కుంటూ కనిపిస్తే.. 'ఎవరో పఠనాసక్తి మెండుగా గల మనిషి' అనీ అనుకుంటారు.

యూనివర్సిటీ టీచర్ల గదుల్లో కనిపిస్తుంటే.. 'వారి బంధుమిత్రులెవరో' అనుకుంటారు.


నిజానికి ఈయన ఎస్వీ యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో పీజీ విద్యార్థి. పేరు రాజేంద్రబాబు. వాణిజ్య పన్నుల శాఖ అధికారిగా రిటైరయ్యాక పీజీలో చేరారు. కార్వేటినగరం మండలం కుమ్మరగుంటకు చెందిన రాజేంద్రబాబు ఎన్ఆర్ కండ్రిగలో ప్రాథమిక విద్య చదివారు. కత్తెరపల్లె, కార్వేటినగరంలలో హైస్కూలు చదువు సాగింది. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. 1977లో ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ ఫిలాసఫీలో చేరారు కానీ చదువు సాగలేదు. ఇంటి దగ్గర వ్యవసాయ పనుల భారం పడింది. చదువు మధ్యలో వదిలేసి ఇంటి బాట పట్టారు. సేద్యం చేసుకుంటూనే పోటీ పరీక్షలు రాయడం మొదలు పెట్టారు. 1980లో రైల్వే సర్వీసు పరీక్షల్లో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ నెగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా మారారు. వాణిజ్య పన్నుల శాఖలో చేరారు. ఉద్యోగం చేస్తూనే 1986లో దూరవిద్య ద్వారా బీఈడీ చేశారు. ఆగిపోయిన పీజీ చదువు పూర్తి చేయాలనే కోరిక ఉండిపోయింది. ప్రయివేటుగా చేసే అవకాశం ఉన్నా యూనివర్సిటీ కేంపస్‌లో చదవడం అనే ఫీలింగ్ రాదు. అది కలగానే ఉండిపోయింది. 2016లో అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రబాబు.. తన కలకు రెక్కలు తొడిగారు. రామచంద్ర మిషన్ నిర్వహిస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలో చేరి తత్త్వశాస్త్ర గ్రంథాలను చదవడం మొదలు పెట్టారు. ఆ పుస్తకాలు చదువుతూ ఉంటే తాను వదిలిపెట్టిన ఎంఏ ఫిలాసఫీ కోర్సు పూర్తి చేయాలనిపించింది. పీజీలో రెగ్యులర్ విద్యార్థిగా చేరిపోయారు. క్రమశిక్షణగా తరగతులకు హాజరవుతారు. సందేహాలుంటే టీచర్లను అడుగుతారు. లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు రెఫర్ చేస్తారు. రాజేంద్రబాబు తల్లి కృష్ణమ్మకి వందేళ్లు. పల్లెలోనే ఉంటుంది. భార్య సుమతి పోర్చుగల్‌లో ఛార్టెడ్ అకౌంటెంట్‌గా పని చేశారు. కుమార్తె చాందినికి వివాహం అయ్యింది. ఇంటి నుంచి ఐదు కిలోమీటర్ల దూరం.. రోజూ సైకిలు మీదనే యూనివర్సిటీకి హాజరవుతారు. విశ్రాంత జీవితాన్ని అర్థవంతంగా మలచుకున్న రాజేంద్రబాబు వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని నిరూపిస్తున్నారు. పీజీ పూర్తయ్యాక ధ్యానంపై విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ చేయాలన్నది ఈయన లక్ష్యం. అదీ సాధించగలననే ఆత్మవిశ్వాసంతో ఉన్నారు రాజేంద్రబాబు.

మా మంచి విద్యార్థి



క్రమం తప్పకుండా యూనివర్సిటీకి వస్తారు. అందరు విద్యార్థులతో కలిసిపోతారు. శ్రద్ధగా కొత్త కొత్త పుస్తకాలను చదువుతారు. సందేహాలను నివృత్తి చేసుకుంటూ ఉంటారు. ఫిలాసఫీపై రాజేంద్రబాబు పట్టు సాధించారు. ఆయనకున్న ఆసక్తి చూస్తే ఆశ్చర్యం, ఆనందం కలుగుతాయి.

- డాక్టర్ నాగలూరి దయాకర్, అధ్యాపకుడు, ఫిలాసఫీ విభాగం, ఎస్వీయూ







అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు - ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

భక్తులతో పోటెత్తిన బోయకొండ

చౌడేపల్లె, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేకువజామునే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

ముగిసిన మహాభారతం ఉత్సవాలు

అలరించిన దుర్యోధన వధ - భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

వెదురుకుప్పం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం మొరవ గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవస్థానం మహాభారతం ఉత్సవాలు ఆదివారం రాత్రి భక్తుల అగ్నిగుండ ప్రవేశంతో ముగిశాయి. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టం జరిగింది. ఇందులో భాగంగా ఆలయ ఆవరణంలో దుర్యోధనుడి మట్టి బొమ్మను తయారు చేసి.. దుర్యోధన, భీముడి వేషధారులు యుద్ధరీతిని ప్రదర్శించారు. దుర్యోధన వధ జరిగాక పాండవుల పట్టాభిషేకం చేశారు. రాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అంతకుముందుగా ద్రౌపది అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు.





దుర్యోధన వధ ఘట్టం - ప్రత్యేక అలంకరణలో ద్రౌపది అమ్మవారు

సంక్రాంతిపల్లెలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి చొరబడ్డ దొంగలు - 73 గ్రాముల బంగారం, రూ.30 వేల అపహరణ

బంగారుపాళ్యం, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని సంక్రాంతిపల్లెలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి దొంగలు చొరబడ్డారు. 73 గ్రాముల బంగారం, రూ.30వేలను అపహరించుకెళ్లారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. సంక్రాంతిపల్లెకు చెందిన ఓమేష్ వేసవి కావడంతో తన ఇంటికి తాళాలు వేసి మిద్దెపైన పడుకున్నాడు. అతడి ఇంట్లో చొరబడ్డ దొంగలు బీరువాను ధ్వంసం చేసి, అందులోని 50 గ్రాముల బంగారం, రూ.30 వేలను ఎత్తుకెళ్లారు. ఇదే గ్రామంలోని రాము ఇంట్లోనూ ఇలాగే చొరబడ్డారు. ఇంట్లోని బీరువాను గ్రామం వెలుపలకు తీసుకొచ్చి పగులగొట్టి అందులోని 23 గ్రాముల బంగారాన్ని అపహరించుకెళ్లారు. అలాగే మునెయ్య, చిట్టిబాబు ఇళ్లలోనూ కొంత బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. ఓమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

రామకుప్పంలో 'గజ' భయం..!

- రామాపురంతాండాలో తిష్ఠ వేసిన జంట ఏనుగులు





ధ్వంసమైన టమోటా తోట - ఏనుగులు తొక్కిన వరిపైరు

రామకుప్పం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం అటవీ ప్రాంత ప్రజల్లో మళ్లీ గజ భయం నెలకొంది. ఆరునెలలుగా ఈప్రాంతంలో ఏనుగుల సంచారం లేకపోవడంతో రైతులు నిర్భయంగా పంటల సాగు చేపట్టారు. మూడ్రోజుల కిందట తమిళనాడు నుంచి రెండు ఏనుగులు రామకుప్పం అటవీప్రాంతంలోకి రావడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. శుక్రవారం రాత్రి రామాపురం తాండాకు చెందిన గోవిందనాయక్ వరి, రాగి పంటల్లోకి చేరుకుని తిన్నంత తిని పంటలను తొక్కి నాశనం చేశాయి. శనివారం నారాయణనాయక్, అమ్ములు అనే రైతులకు చెందిన అరటి, టమోటా, వరి పంటలపై దాడులు చేశాయి. అటవీ అధికారులకు సమాచారం అందడంతో అక్కడకు చేరుకుని జంట ఏనుగులు పొలాల వైపు రాకుండా ట్రాకర్ల సాయంతో వాటిని అటవీ లోతట్టు ప్రాంతానికి తరిమేశారు. ప్రస్తుతం అవి రామాపురంతాండా, నారాయణపురం తాండాల మధ్యనున్న నాయనచెరువు సమీపంలోని అడవిలోనే తిష్ఠ వేశాయని అటవీ అధికారులు తెలిపారు. ఏనుగులు పొలాలు, జనావాసాల వైపు రాకుండా కట్టడి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. చీకటి పడ్డాక రైతులెవరూ పొలాల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు.

కొనసాగుతున్న ఒంటరి ఏనుగు దాడులు

కల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు నిత్యం కొనసాగుతున్నాయి. పాళెం పంచాయతీలో శనివారం రాత్రి ఒంటరి ఏనుగు కొబ్బరి చెట్లను ధ్వంసం చేసింది. తూర్పు విభాగం అటవీప్రాంతం నుంచి బయల్దేరిన ఒంటరి ఏనుగు పాళెం పంచాయతీ కేంద్రం వద్దకు చేరుకుంది. గ్రామంలోని రైతు లలితమ్మకు చెందిన కొబ్బరిచెట్లను ధ్వంసం చేసింది. గమనించిన స్థానికులు టపాసులు పేల్చారు. దాంతో అక్కడినుంచి వచ్చిన దారిలోనే అడవిలోకి తిరుగుముఖం పట్టింది. ఈ మార్గంలోని పలువురి రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిందని స్థానికులు వాపోయారు. ఒంటరి ఏనుగు ధ్వంసం చేసిన పంటలను ఆదివారం ఉదయం అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు.



ఏనుగు విరిచేసిన కొబ్బరిచెట్టు

తప్పుల సవరణ ఎప్పుడు?

రేషన్‌కార్డుదారుల ఎదురుచూపులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రైస్ కార్డు పేరుతో 2020లో జారీచేసిన రేషన్ కార్డుల్లో తప్పులు కోకొల్లలుగా ఉన్నాయి. వీటిని సరి చేసుకోవడానికి అవకాశం ఇవ్వలేదు. ఇప్పటికీ అవే తప్పులతో కార్డులు కొనసాగుతున్నాయి. ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ ఏటీఎం కార్డు సైజులో రేషన్ కార్డు ఇస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి ఈకేవైసీ చేసుకోవడానికి ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో తప్పుల సవరణతోపాటు మార్పు, చేర్పులపై ప్రకటన ఎప్పుడు వస్తుందా అని రేషన్‌కార్డుదారులు ఎదురుచూస్తున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

కోళ్ల పెంపకందారుల డిమాండ్

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని జిల్లాలోని కోళ్ల పెంపకందారులు డిమాండ్ చేశారు. ఆదివారం గంగమ్మగుడి దేవస్థానం ఆవరణంలో వారు సమావేశమై మీడియాతో మాట్లాడారు. కోళ్ల పరిశ్రమల్లో పెట్టుబడి ఎక్కువ కావడంతో లాభాలు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. కంపెనీ వారు కూడా ఇక్కట్లకు గురిచేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో కోళ్ల పెంపకందారులు నాగరత్న, చెంగమనాయుడు, లోకనాథంరెడ్డి, నాగరాజు, కిషోర్, గజేంద్రన్, తిరుమలేష్ శశిధర్ చౌదరి, కుమార్, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మ గుడి వద్ద సమావేశమైన కోళ్ల పెంపకందారులు

'చేనేత' జిల్లా అధ్యక్షుడిగా బాలాజి



పెనుమూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చేనేత యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా పెనుమూరు మండలం గొడుగుమానుపల్లె గ్రామానికి చెందిన చల్లా బాలాజీ, ప్రధానకార్యదర్శిగా నగరికి చెందిన కందల బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఆదివారం పెనుమూరు చేనేత భవన్‌లో నిర్వహించిన చేనేత సర్వసభ్య సమావేశం, నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల చేనేత యూనియన్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి షణ్ముఖర్మ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది.

తిరుమలలో 'హిట్-3' బృందం

నడిచి కొండకు చేరుకున్న నాని, శ్రీనిధిశెట్టి

తిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో హీరో నాని ఆదివారం సందడి చేశారు. హీరోయిన్ శ్రీనిధిశెట్టి, హిట్-3 సినిమా బృందంతో కలిసి తెల్లవారు జామున సుప్రభాత సేవలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రతిఏడాది శ్రీవారి దర్శనానికి వస్తుంటానని, అలాగే ప్రతి సినిమా ముందుకు తిరుమలకు రావడం ఆనవాయితీగా మారిపోయిందన్నారు. ఆలయం ముందు హీరో, హీరోయిన్‌లతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. శనివారం రాత్రి నాని, శ్రీనిధి శెట్టి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. భక్తులు గుర్తించకుండా ఉండేందుకు నాని నడకదారిలో ముఖానికి మాస్క్‌లా గుడ్డ కట్టుకున్నారు.



అభిమానులతో సెల్ఫీ దిగుతున్న నాని

బోయకొండ గంగమ్మకు బోరు మోటారు విరాళం


దాతలు విరాళంగా ఇచ్చిన మోటారు నుంచి వస్తున్న నీరు

చౌడేపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి రూ.2.50 లక్షల విలువైన బోరు మోటారును కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు విరాళంగా ఇచ్చినట్లు ఉపకమిషనర్, ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం రామగుండంహళ్లి గ్రామం, యల్లహంక, బెంగళూరుకు చెందిన చిక్కకెంపన్న, ప్రకాష్, గంజేంద్ర, మల్లిఖార్జున్‌లు భక్తుల సౌకర్యం కోసం బోరు మోటారు, పైపులు, కేబుల్, స్టార్టర్‌లను విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.

పేదల సేవల్లో 'మానవతా సేవా సంస్థ'


మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా మానవతా సేవా సంస్థ పని చేస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు అనంతరం ఫ్రీజర్ బాక్స్‌లు, వైకుంఠ రథాలు అందుబాటులో ఉంచి పేదలకు ఉచితంగా సేవలు అందజేస్తున్నట్లు వివరించారు. రానున్న కాలంలో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించడానికి అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడానికి సంస్థ ప్రతినిధులు ద్వారా నిధులు సేకరిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు నారాయణరెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో చేసిన అల్లర్లు, తీపి గుర్తులు, పలకరింపులతో పూర్వపు విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పుంగనూరు కొత్తయిండ్లు హైస్కూల్‌లో 2004-2005 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఒక్కటయ్యారు. చిన్నతనంలో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. చదువులు పూర్తి చేసుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడి 20 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం తమ గురువులు సదాశివరెడ్డి, మనోహర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, నాగమణి, ఉమాదేవి, జమునా, మాధురి, నజీర్, ముస్తఫా, రఫిక్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు సుమలత, పరిమళ, భారతి, మాధవి, గాయిత్రి, నవీన్, అశోక్‌కుమార్, బాలాజీ, అజయ్, వెంకటస్వామి, సురేశ్, షామీర్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చంద్రమాకులపల్లె విద్యార్థులు


ఎంపికైన విద్యార్థినులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ క్రీడా పోటీలకు పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, పీడీ మురళీధర్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ చంద్రమాకులపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఒంటిమిట్టకు చెందిన జగన్నాథం కుమార్తె శ్రీలత మే 7న తేదీన తమిళనాడు రాష్ట్రం సేలంలో జరిగే సౌత్ ఇండియా సబ్ జూనియర్ షూటింగ్‌బాల్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లా వశిష్ఠ పాఠశాలలో జరిగిన షూటింగ్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో పదో తరగతి చదువుతున్న జ్యోత్స్న తృతీయ స్థానంలో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు.

ఏకగ్రీవంగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు


ఎన్నికలో పాల్గొన్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం టీడీపీ సంస్థాగత ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఇందులో భాగంగా పాతపేటలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో పంచాయతీ అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పృథ్వీ ఎన్నికయ్యారు. పాతూరునత్తం అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంగౌడు, ప్రధాన కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి, గంగినేపల్లె అధ్యక్షుడిగా శ్రీనివాస్, బైరెడ్డిపల్లె పంచాయతీ అధ్యక్షుడిగా మొయినుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని పలువురు టీడీపీ నాయకులు అభినందించారు.

కంటి శస్త్రచికిత్సలకు 30 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సదుం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 200 మందికి కంటి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు నరసింహులు తెలిపారు. సదుం జడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు సేవలు అందించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆస్పత్రి కంటి వైద్యులు సీతారామయ్య, వేణు, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు

బంగారుపాళ్యం,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలం లోని సంక్రాంతిపల్లె పంచాయతీ మిట్టపల్లె గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆది వారం అర్జున తపస్మాన్ ఘట్టంగా భక్తుల మధ్య వైభవం గా జరిగింది. అర్జున తపస్మాన్ ఘట్టానికి మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హరినారాయణ

సోమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సోమలలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ లో ఆయన విగ్రహ ఏర్పాటుకు ఆదివారం బంగారు తిరుత్తణి ఆలయం వద్ద నిర్వాహక కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రిన్సిపాల్ వైఎస్. మునిరత్నం మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా శ్రీకృష్ణదేవరాయల అభిమానులు విగ్రహ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మే 4న సోమలలో విగ్రహ ప్రతిష్ఠకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా బీసీ సంక్షేమ అధికారి మునివెంకటప్ప, డాక్టర్ హరినారాయణ, సాంబయ్య, సీజీ.రెడ్డెప్ప, నగేశ్, సాంబశివయ్య, జ్యోతీశ్వరుడు, శ్రీరాములు, వీవీ. రమణ, రఘు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు పురస్కారాలు

పలమనేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన గాండ్ల కులానికి చెందిన విద్యార్థులకు వచ్చే నెల 4వ తేదీన తిరుపతిలోని పూజిత రెసిడెన్సి హోటల్‌లో జ్ఞాపికలతోపాటు ప్రశంసాపత్రాలు అందజేస్తున్నట్లు జిల్లా గాండ్ల సంఘ అధ్యక్షులు ఏఆర్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నటు పేర్కొన్నారు. ఈనెల 30 లోపు అత్యధిక మార్కులు సాధించిన గాండ్ల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్‌నంబర్లు 9701213262, 9885855154, 9963097313 లను సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య


ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య సాధ్యమని పాఠశాల హెచ్‌ఎం సయ్యద్ సాహేబ్ వలి తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సయ్యద్ సాహేబ్ వలి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో పర్యటిస్తూ పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది టెన్త్ ఫలితాలు 73 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. ఇప్పటికే 18 మంది విద్యార్థుల అడ్మిషన్లు జరిగాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అద్భుతంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అక్బర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని విద్యుత్ స్తంభాల ధ్వంసం


ప్రమాదంలో కారుపై పడిన విద్యుత్ స్తంభం

కల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులో ఆదివారం వేకువజామున లారీ ఢీకొన్న ప్రమాదంలో మూడు విద్యుత్ స్తంభాలు, ఓ కారు ధ్వంసం మైంది. బియ్యం లోడ్డుతో ఆదివారం వేకువజామున కల్లూరు పట్టణంలోని దిగువవీధికి ఓ లారీ చేరుకొంది. బియ్యం లోడ్డు దించే క్రమంలో లారీ ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి నేలపై పడగా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీన్ని గమనించని లారీ డ్రైవర్ మరింత ముందుకు వెళ్లడంతో మరో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వీధిలో నిలబెట్టిన కారుపై విద్యుత్ స్తంభం పడటంతో కారు పాక్షికంగా దెబ్బతింది. అయితే ప్రజలు ఎవరూ రోడ్డుపై లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఉదయం ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ పురుషోత్తం సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధించారు.

పిల్లల్లో విలువల పెంపునకు తరగతులు


తరగతులు ప్రారంభిస్తున్న మధుసూదనం

పుంగనూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో క్రమశిక్షణ, విలువల పెంపు కోసం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బాలవికాస్ ఉచిత వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం తెలిపారు. ఆదివారం స్థానిక టీచర్స్‌కాలనీలోని షిర్డిసాయిబాబా మందిరంలో శిక్షణ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి వచ్చే నెల 6 వరకు ఉచితంగా ఆరేళ్ల నుంచి 12 ఏళ్ల లోపు పిల్లలకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9492656804 ఫోన్‌నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సాయిమందిర వ్యవస్థాపక అధ్యక్షులు సదాశివరెడ్డి, బాలవికాస్ సంయుక్త సమన్వయకర్త హేమలత పాల్గొన్నారు.

జిల్లా ఎస్డీపీఐ అధ్యక్షుడిగా యూసుఫ్



మాట్లాడుతున్న ఎస్డీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా

పుంగనూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా నూతన ఎస్డీపీఐ అధ్యక్షుడిగా యూసుఫ్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక జడ్పీ బంగ్లాలో జరిగిన ఎస్డీపీఐ కార్యకర్తల సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా జమీర్‌లాల్, ప్రధాన కార్యదర్శులుగా రోషన్, యూనుస్, కార్యదర్శులుగా జబీవుల్లా, ఏజాజ్‌లు, కోశాధికారిగా కరీం, కమిటీ సభ్యులుగా సులేమాన్, హుజెఫ, మహబూబ్, ఖాదర్‌బాషాలతో పాటు 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నిక చేసినట్లు ఆయన తెలిపారు.

మత్స్యకారులకు చంద్రబాబు భరోసా

● పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకారుల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా కల్పించారని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10 నుంచి రూ.20 వేలకు పెంచడం జరిగిందన్నారు. దీంతో 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరనుందని తెలిపారు. మత్స్యకార కుటుంబాలు టీడీపీకి అండగా నిలబడ్డాయని, వెనుకబడ్డ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు చేస్తే ఒక్క మత్స్యకారుడి కుటుంబమైనా బాగుపడిందా అని ప్రశ్నించారు. 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశపెట్టిందని వివరించారు. 2014-19 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ. 788 కోట్లు ఖర్చుపెట్టడమే కాకుండా వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని 68,396 మంది మత్స్యకారులకు ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్నారని.. వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, వేటకు వెళ్లే బోట్లకు లీటరు డీజిల్ పై రూ.9 రాయితీ ఇస్తోందన్నారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలుండగా చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందు వరుసలో ఉందని తెలిపారు. మత్స్య ఉత్పత్తులతో 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. మత్స్యకారుల సేవలో ముఖ్యమంత్రి పథకాన్ని ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు.

భూవివాదంలో వ్యక్తిపై హత్యాయత్నం

రామకుప్పం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భూవివాదం నేపథ్యంలో రామకుప్పం మండలం తులసీనాయక్‌తాండాలో ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. పోలీసుల కథనం మేరకు... తులసీనాయక్‌తాండాకు చెందిన రామానాయక్, దొరస్వామినాయక్‌లు అన్నదమ్ములు. వారి కుటుంబాల మధ్య భూవివాదం నడుస్తోంది. దొరస్వామినాయక్ పేరిట ఉన్న భూమిని తన పేరిట రాసివ్వాలంటూ రామానాయక్ కుమారుడు చక్రవర్తినాయక్ తరచూ అతనితో గొడవపడుతుండే వాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో దొరస్వామినాయక్ పొలం నుంచి వస్తుండగా.. చక్రవర్తినాయక్ అడ్డగించి ఇనుపరాడ్‌తో విచక్షణ రహితంగా దాడిచేసి హతమార్చే ప్రయత్నం చేశాడు. దాడిలో తీవ్రగాయాలకు గురైన దొరస్వామినాయక్ కుప్పకూలాడు. దీంతో చక్రవర్తినాయక్ అక్కడి నుంచి పరారయ్యాడు. దొరస్వామినాయక్ కుటుంబ సభ్యులు అతడిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్‌ఐ వెంకటమోహన్ చక్రవర్తినాయక్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆదివారం తులసీనాయక్ తాండా వద్ద చక్రవర్తినాయక్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రాళ్లబూదుగూరు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

రాయలచెరువు ఇసుక వివాదంలో ఘర్షణ

● ఇద్దరికి గాయాలు


చికిత్స పొందుతున్న శ్రీనివాసులు, ప్రసాద్

పుంగనూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇసుక తరలిస్తున్న వివాదంలో రెండు వర్గాలు ఘర్షణ పడి ఇద్దరు గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం పుంగనూరు సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా... పట్టణ సమీపంలోని రాయల్‌చెరువులో ఇసుకను మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ కమతంపల్లెకు చెందిన ప్రసాద్, శ్రీనివాసులు, గిరి, మునిరాజ ట్రాక్టర్లతో తరలించడానికి తోడుతున్న విషయం తెలుసుకున్న మంగళంకు చెందిన లోకేశ్, సూరి కొంత మందితో వచ్చి చెరువులో ఇసుక తరలించరాదని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ప్రసాద్, శ్రీనివాసులు తీవ్రంగా గాయపడటంతో వారితో ఉన్న మునిరాజ గాయపడిన ప్రసాద్, శ్రీనివాసులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ లోకేశ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ఘర్షణపై ఆరా తీసి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళను మోసగించి బంగారం చోరీ

సోమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధ మహిళ వద్ద ఓ మాయగాడు 20 గ్రాముల బంగారు నగలు తస్కరించి పరారైన సంఘటన ఆదివారం సోమల మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. సూరయ్యగారిపల్లెకు చెందిన రెడ్డెప్ప గ్రామ సమీపంలోని పాఠశాల వద్ద చిన్నపాటి చిల్లర దుకాణాన్ని పెట్టుకుని భార్య ఎల్లమ్మతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం రెడ్డెప్ప అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి ఎల్లమ్మ ఒంటరిగా ఉండి చిల్లర దుకాణాన్ని నడుపుకుంటోంది. శనివారం ఓ మహిళ గ్రామంలో తిరుగుతూ మహిళలతో మాటలు కలిపి ఒంటరి మహిళలను గుర్తించి కుటుంబ ఆర్థిక పరిస్థితులను ఆరా తీసింది. అలాగే కుటుంబ సమస్యలు, ఆరోగ్య పరిస్థితులు మెరుగు పరిచేందుకు ఓ సాధువు ఉన్నాడని, ఆయన హస్తవాసి బాగుందని మహిళలను నమ్మించింది. ఈ క్రమంలోనే ఆదివారం ఎర్రని దుస్తులు ధరించిన ఓ వ్యక్తి గ్రామంలో ప్రవేశించాడు. ఒంటరిగా దుకాణం వద్ద ఉన్న ఎల్లమ్మను కలిసి మాయమాటలతో కుటుంబ పరిస్థితులను బాగు చేస్తానని నమ్మించాడు. అందుకోసం ఏదైనా ఆలయంలో పూజలు చేయాలని తెలిపాడు. ఎల్లమ్మ వద్ద పూజా సామగ్రిని తీసుకుని పూజలో బంగారం పెట్టాలని నమ్మించాడు. ఆమె వద్ద ఉన్న కొన్ని బంగారు నగలును సాధువుకు అందించింది. సమీపంలోనే ఉన్న సాయిబాబా ఆలయం వద్ద పూజకు సిద్ధం చేస్తానని పూజా సామగ్రి, సుమారు 20 గ్రాముల బంగారం తీసుకుని ద్విచక్రవాహనంలో వెళ్లాడు. ఎల్లమ్మ దుకాణానికి తాళం వేసి గుడి వద్దకు వెళ్లి చూడగా ఆ దొంగ పరారైనట్లు గుర్తించి గ్రామస్తులకు విషయం చెప్పడంతో గాలించారు. చివరకు మోసపోయానని గుర్తించి బాధితురాలు సోమల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

సోమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఈక్రమంలోనే ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అలంకరణలు చేసి పూజలు చేశారు. అర్చకుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించి ఆలయ ఆవరణలో స్వామివార్ల కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణం జరిపారు. నందివాహనంపై ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదారులు, ధర్మకర్తలు బీవీ సోమశేఖర్, సుబ్రహ్మణ్యం బాబు, నరేంద్ర, శోభన్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గురువులకు పాదాభివందనం


హాజరైన పూర్వవిద్యార్థినులతో గురువులు

పలమనేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు బాలికోన్నత పాఠశాలలో ఆదివారం 2005-2006 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థినులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో పూర్వవిద్యార్థులు తమకు ఆనాడు విద్యాబుద్దులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు.

బాటగంగమ్మ ఆలయంలో అమావాస్య పూజలు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని బాటగంగమ్మ ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నాగేంద్ర అమ్మవారికి అభిషేకం చేసి విశేషాలంకరణ నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంవద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రొంపిచెర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం బండకింద పల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించినట్లు ఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. రొంపిచెర్ల - పీలేరు జాతీయ రహదారి పక్కనే వేపచెట్టు వద్ద మృతదేహం గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేలుపట్ల సమీపంలో ఆదివారం పేకాట ఆడుతుండగా సిబ్బందితో దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. వారి నుంచి రూ.7500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి

గంగవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని కూర్నిపల్లె క్రాస్ వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గంగవరం మండలం కూర్నిపల్లె గ్రామానికి చెందిన నీలకంఠం భార్య గిరిజమ్మ (58) సొంత పనిపై గంగవరం వైపు నడుచుకొని వస్తుండగా.. ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గిరిజమ్మను హుటాహుటిన పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో ప్రాథమిక చికిత్స అనంతరం చిత్తూరుకు తరలించారు. చిత్తూరులో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం సీఐ ప్రసాద్ తెలిపారు.

అక్రం మృతికి ఎమ్మెల్యే నివాళి


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రజాక్ కుమారుడు కిజర్ అక్రం గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేరుకుని నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

2 నుంచి జౌకుపల్లెలో చౌడేశ్వరమ్మ బ్రహ్మోత్సవాలు

రామకుప్పం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం జౌకుపల్లెలోని చౌడేశ్వరమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 2 నుంచి 6 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2న ఉదయం అంకురార్పణ, రాత్రి పండరి భజన, 3న రాత్రి చౌడేశ్వరమ్మ ఉత్సవం, గ్రూప్‌డ్యాన్స్, 4న రాత్రి పుష్పపల్లకీ సేవ, 5న రాత్రి పచ్చిగెరిగె ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశం, 6న పొంగళ్లు, దీపారాధన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సమత సైనిక్‌దళ్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సంతోష్ తెలిపారు. సమత సైనిక్‌దళ్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ స్ఫూర్తితో స్థాపించిన సమత సైనిక్‌దళ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాటం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు


ఏవీరావు వీధిలో తనిఖీ చేస్తున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఏవీరావు వీధిలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు స్థానిక మహిళలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ అక్కడకు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీంతో అక్కడి మహిళలు సీఐతో మాట్లాడుతూ అనుమానితులు అధిక సంఖ్యలో తిరుగుతున్నారని, తమకు ఇబ్బందిగా ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ చుట్టుపక్కల మహిళలతో ఆయన మాట్లాడుతూ అనుమానితులు తిరిగినట్లు గుర్తించి తనకు సమాచారం ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎస్‌ఐ లోకేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గల్లా అరుణకుమారి జీవితం స్ఫూర్తిదాయకం



గల్లా అరుణకుమారి జీవిత పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యేలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గల్లా అరుణకుమారి రాజకీయ జీవితం నేటి రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ అన్నారు. ఆదివారం బెంగళూరులోని ఏఎంసీ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన గల్లా అరుణకుమారి చరిత్ర పుస్తక పరిచయ సభలో ముఖ్య అతిథులుగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం



చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక లెనిన్ నగర్‌లోని నగరపాలక డంపింగ్ యార్డులో ఆదివారం అగ్ని ప్రమా దం చోటు చేసుకుంది. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. మున్సిపల్ సిబ్బంది సైతం అగ్నిప్రమాద నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు స్థానికులకు భరోసా ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న సమత సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సమత సైనిక్‌దళ్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సంతోష్ తెలిపారు. సమత సైనిక్‌దళ్ స్థాపించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ స్ఫూర్తితో స్థాపించిన సమత సైనిక్‌దళ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాటం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

ద్రౌపదీదేవి తిరునాళ్ల ప్రారంభం

పాలసముద్రం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాల గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఆదివారం ప్రారంభించారు. తొలుత ద్రౌపదీ సమేత పాండవుల విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తర్వాత కోడి స్తంభానికి పూజలు చేసి మహాభారత ఉత్సవాలను ప్రారంభించారు. మధ్యాహ్నం భాగవతారిణి మాల శ్రీకృష్ణ మహాభారత ఘట్టాన్ని హరికథ రూపంలో వినిపించారు. ఆలయ నిర్వాహకులు భక్తలకు అన్నదానం చేశారు.

కమనీయం.. కల్యాణం



గుడిపాల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పానాటూరులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం ద్రౌపదీదేవి కల్యాణోత్సవానికి అర్చకులు మహేష్‌శర్మ వైభవంగా నిర్వహించారు. బొమ్మసముద్రం గ్రామానికి చెందిన జయశేఖర్ రెడ్డి, గీత దంపతులు, స్వర్ణలత కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం సర్పంచ్ పల్లవి, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం అర్జున తపస్సు హరికథను వినిపించారు. సోమవారం కీచక వధను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా బాలల యోగా తరగతులు ప్రారంభం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి):గిరంపేట నగర పాలక ఉన్నత పాఠశాలలో సిద్ధ సమాధి యోగా శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బాలల యోగా శిక్షణా తరగతులు ప్రారంభించారు. బాలకు వ్యాయామాలు, సూర్య నమస్కారాలు, యోగసనాలు, ప్రాణాయామం, ధ్యానం, చిత్రలేఖనం, ఏకాగ్రత, గాయత్రి మంత్ర పఠనం, ఆటలు, పాటలు, నృత్యం, ఆహారపు అలవాట్లు తదితర అంశాలను బోధించారు. సాయంత్రం పెద్దలకు యోగ శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగా గురువు నరేంద్రకుమార్‌జీ, బ్రహ్మయ్య, జగన్నాథ్, సుబ్రమణ్యం రెడ్డిలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): స్థానిక రాముల గుడి వీధిలోని జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి నగరవాసుల నుంచి విశేష స్పన లభించింది. తిరుపతి అరవింద నేత్రవైద్యశాల డాక్టర్ల సహకారంతో నిర్వహించిన వైద్య పరీక్షలకు 210 మంది రోగులు హాజరయ్యారు. వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. 115 మందికి కంటి ఆపరేషన్లు అవసరం కాగా వారికి జైన్ సంఘం అన్ని ఖర్చులు భరించి వైద్యం చేయించ నున్నట్లు సంస్థ అధ్యక్షులు సుభాష్‌జైన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీన్, లలిత్, కమలేష్, అమిత్, సాగర్ జైన్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లె గ్రామానికి చెందిన రామయ్య(44) ద్విచక్ర వాహనంలో ఆదివారం రాత్రి స్వగ్రామం నుంచి 49.కొత్తపల్లెమిట్ట సంతకు వచ్చాడు. కూరగాయలు తీసుకొని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గ మధ్యలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై కొటార్లపల్లె వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక వైపు ఢీకొంది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కూటమి రాకతో
మత్స్యకారుల్లో ఆనందం

చిత్తూరు సెంట్రల్, / వెదురుకుప్పం/ నగరి ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారులకు మంచిరోజులు వచ్చాయని చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, నగరి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, థామస్, గాలి భానుప్రకాష పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. చేపల వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థికసాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారని పేర్కొన్నారు. దీనిద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 1,29,178 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్లు లబ్ధి చేకూరుతుందని వివరించారు.

హర్యానా పారిశుధ్య కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

● ఏఐటీయూసీ డిమాండ్



కార్మికుల మృతికి మౌనం పాటిస్తున్న కార్మికులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రంలో ఆదివారం తెల్లవారు జామున విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై వాహనం దూసుకెళ్లడంతో ఆరుగురు కార్మికులు మరణించారు. వీరి కుటుంబానికి హర్యానా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట వారి మృతికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజన్, చంద్ర, మణి, విజయ్‌కుమార్, జయశంకర్, సుగుణ, వినోద్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బంగారుపాళ్యం,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి రూ.3,940 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కత్తి శ్రీనివాసులు కథనం మేరకు.. తగ్గువారిపల్లె సమీపంలోని రాజన్న మామిడి తోపు సమీపంలో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు దాడిచేసి పట్టాభి, అమానుల్లా బాషా, క్రిష్ణయ్యలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు.

బోయకొండకు ఓంశక్తి భక్తులు



శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం 49. కొత్తపల్లెమిట్ట గ్రామానికి చెందిన సుమారు 50 మంది ఓంశక్తి భక్తులు మేళతాళాలతో, ఊరేగింపుగా బోయకొండ గంగమ్మ దర్శనానికి వెళ్లారు. ఓంశక్తి భక్తులు నాగామణి, బాలమ్మ, గోవర్ధని, కస్తూరి, సుహాసిని, స్వప్న, వాణి, దేవి, తదితరులు వెళ్లారు.

రంగులేయండి సారూ...!



యాదమరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయ బోర్డు తుప్పు పట్టి రంగులు వెలసిపోయి ఉంది. నిత్యం ఎంపీడీవో కార్యాలయానికి ఆ శాఖ అధికారులు వచ్చి వెళుతుంటారు. అయితే కార్యాలయ గేటు వద్ద ఉన్న సూచిక బోర్డు రంగులు వెలిసిపోయి కళావిహీనంగా మారింది. ఎంపీడీవో పట్టించుకొని సూచిక బోర్డుకు నూతన రంగులు వేసి బాగుచేయాలని కార్యాలయానికి వచ్చే ప్రజలు కోరుతున్నారు.

30న కుంభాభిషేకం

గుడిపాల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాల పంచాయతీ ముత్తవాళ్లఊరులో ఈ నెల 29, 30న గంగమ్మ ఆలయ కుభాభిషేకం వేడుకలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు, నిర్వాహకులు తెలిపారు. కుంభాభిషేకం వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

శివాజీ నగర్‌పై దయచూపండి సారూ..!

డ్రైనేజీ వ్యవస్థ లేదు ● శ్మశానానికి ప్రహరీ లేదు ● ఇళ్ల పక్కనే మృతదేహాల దహనం ● పట్టించుకోని అధికారులు



ఇళ్లను ఆనుకుని ఉన్న శ్మశానం, ఇళ్ల వెనుక నిలిచిపోయిన మురుగు, మృతదేహాన్ని దహనం చేయగా మిగిలిన అస్థికలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శివాజీనగర్ వాసులను డ్రైనేజీ సమస్య వేధిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల వెనుక డ్రైనేజీ నీరు నిలిచిపోతోంది. చాలా ఇళ్ల పునాదులు డ్రైనేజీ నీటితో నానుతూనే ఉంటాయి. దీనివల్ల ఇళ్ల పునాదులు సైతం దెబ్బతినే ప్రమాదం ఉంది. 15 రోజులుగా డ్రెయిన్ నుంచి విపరీతమైన దుర్వాసన వస్తోంది. కనీసం భోజనం చేయాలన్నా వీలుకావడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇక ఇళ్ల పక్కనే శ్మశాన వాటిక ఉంది. మృతదేహాలను దహనం చేసే సమయంలో వెలువడే కాలుష్యంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి. కనీసం శ్మశానికి ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా విద్యుత్ లేదా గ్యాస్ ఆధారిత దహన వాటిక ఏర్పాటు చేస్తే సమస్య ఉండదని ఇక్కడి జనం పేర్కొంటున్నారు. గతంలో ఈ సమస్యలపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారే గానీ శాశ్వత పరిష్కారం చూపలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి శాశ్వతంగా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీదుర్గ మృతిపై పోలీసులకు ఫిర్యాదు



శ్రీదుర్గ పోస్టుమార్టం రిపోర్టును చూపుతున్న షణ్ముగం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ చిత్తూరు పార్లమెంటు మహిళా విభాగం కార్యదర్శి శ్రీదుర్గ మృతిపై పోలీసులకు ఆమె తండ్రి, టీడీపీ సీనియర్ నేత, బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం ఆదివారం ఫిర్యాదు చేశారు. తన కుటుంబీకులు, మానవ హక్కుల సంఘం నేతలతో కలిసి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈనెల 21వ తేదీన తన కుమార్తె ఫారెస్టు రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదానికి గురైందన్నారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యపరీక్షలు చేసిన డాక్టర్ సౌమ్య తన కుమార్తెకు ఎలాంటి ప్రమాదం లేదని, భుజంలో ఫ్రాక్చర్ అయ్యిందని బ్యాండేజ్ వేశారన్నారు. తలకేమైనా గాయమైందేమో సీటీ స్కాన్ తీయాలని డాక్టర్‌ని కోరగా.. 'నువ్వా, నేనా డాక్టర్' అని తన పట్ల దురుసుగా మాట్లాడారని చెప్పుకొచ్చారు. చేసేదేమీలేక తన కుమార్తెను ఇంటికి తీసుకెళ్లిన మరుసటి రోజునే మృతి చెందిందన్నారు. వైద్యులు తన బిడ్డ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, తలకు బలమైన గాయమవ్వడంతో మృతిచెందినట్లు నివేదికలో వెల్లడించారన్నారు. తన కుమార్తె మృతికి కారణమైన అపోలో వైద్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్పెషల్ డీఎస్పీల వ్యవస్థ పునరుద్ధరించాలి



మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేస్తున్న బహుజన సేన నాయకులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్పెషల్ డీఎస్పీల వ్యవస్థ పునరుద్ధరణ, దళితులపై దాడులకు నిరసనగా మే 5న విజయవాడ మహాధర్నా చేపట్టనున్నట్లు బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చందు తెలియజేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2024లో గుట్టచప్పుడు కాకుండా 98మంది ఎస్సీ, ఎస్టీ స్పెషల్ పోలీస్ స్టేషన్ల డీఎస్పీల పోస్టింగులను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీలపై హత్యాచారాలు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు మెరుగైన సత్వర న్యాయాన్ని అందించడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సు ద్వారా 2014లో ఈ స్పెషల్ డీఎస్పీల వ్యవస్థ ఏర్పాటైందని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీల రక్షణకు ఎంతో ఉపయోగకరమైన ఈ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నేతలు గోవిందప్ప, సతీష్, కుమార్, హరి, బాలు, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజలు సన్మార్గంలో నడవాలి

పాలసముద్రం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజలు భక్తి భావంతో సన్మార్గంలో నడవాలని కర్ణాటకలోని ఉడిపి అడమారు పీఠాధిపతి విశ్వప్రియతీర్థస్వామీజీ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బలిజకండ్రిగ టీటీడీ కల్యాణ మండపంలో ఆయన పూజలు నిర్వహించారు. తమిళనాడులోని షోలింగర్‌లో ఉన్న పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించాక తన శిష్యులతో కలిసి 14 కిలోమీటర్లు పాదయాత్రగా బలిజకండ్రిగకు వచ్చి ఇక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉడిపి నుంచి బయలుదేరి ప్రముఖ పురాతన ఆలయాలను సందర్శిస్తూ చివరిగా తిరుమలలో స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అవుతామన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం మురళిస్వామి, సుగంధరాజు, స్వామిజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన అర్జున తపస్మాన్



తపస్మాన్‌ను అధిరోహిస్తున్న అర్జున వేషధారి, తపస్మాను వద్ద వరపడ్డ మహిళలు

బంగారుపాళ్యం,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్రాంతిపల్లె పంచాయతీ మిట్టపల్లె గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆది వారం అర్జున తపస్మాన్ ఘట్టంగా భక్తుల మధ్య వైభవం గా జరిగింది. అర్జున తపస్మాన్ ఘట్టానికి మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంతకు ముందు అర్జునుడి ఉత్సవమూర్తిని అర్చకులు అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అర్జునుడి వేషధారుడు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తపస్మానును అధిరోహిస్తూ పద్యాలు పాడుతూ నిమ్మకాయలు, విబూది పండ్లు, బొరుగులు, పుష్పాలు ఒకొక్కక్క మెట్టు ఎక్కుతూ భక్తులపై చల్లారు. ఆ నిమ్మకాయలు దక్కించుకోవడం కోసం భక్తులు పోటీపడ్డారు. పిల్లలు లేని మహిళలు తపస్మాన్ చుట్టూ వరపడ్డారు. ఈ ఘట్టానికి మహాసముద్రం గ్రామానికి చెందిన లత, జయరామశెట్టి ఉభయదారులుగా వ్యవహరించారు.

యాదమరిలో వెలగని వీధి లైట్లు



యాదమరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వీధుల్లో లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో అంతరాష్ట్ర రహదారిపై బస్టాండ్ ప్రాంతంలో, యాదమరి ఇందిరమ్మ కాలనీతో పాటు పలు గ్రామాల పరిధిలో వీధిలైట్లు వెలగకపోవడం వల్ల రాత్రి పూట బయట తిరిగేందుకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలే వేసవిలో రాత్రిపూట బయట విషసర్పాలు సంచరిస్తుంటాయి. అధికారులు స్పందించి వీధుల్లో లైట్లు వేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ఐరాలలో కొవ్వొత్తుల ర్యాలీ



ఐరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు,ప్రజలు

ఐరాల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా ఆదివారం సాయంత్రంలో ఐరాలలో మాజీ సైనికుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలని వీఎస్.అగ్రహారం జెండామాను నుంచి ఐరాల సింగిల్ విండో వరకు ర్యాలీ చేపట్టారు. సింగిల్ విండో వద్ద అందరూ కలసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు సీతాపతినాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో ఉగ్రవాదం నశించాలన్నారు. పలువురు ముస్లింలు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని కోరారు. ● టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు ఆధ్వర్యంలో పాటూరుసంతగేటులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు శ్రీనివాసులు, బాల, నాయకులు రాజేష్‌రెడ్డి, జలీల్, ఖయ్యూం, హరినాథ్‌గుప్తా, లోకనాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో రెండు నెలలపాటు తనిఖీలు



చిత్తూరు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో చిత్తూరు రైల్వేస్టేషన్‌లో రెండు నెలల పాటు తనిఖీలు కొనసాగుతాయని జీఆర్పీఎఫ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం రైల్వేస్టేషన్‌లో డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేశాయి. ఆర్పీఎఫ్ ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

వసతులు ఉంటే ఒట్టు..!

● హౌసింగ్ కాలనీల్లో అసంపూర్తి నిర్మాణాలు
● రోడ్లు లేవు, తాగునీరు లేదు



ఏపీఐఐసీ కాలనీలో మోల్డింగ్‌కే పరిమితమై ఉన్న పక్కాగృహం, పిచ్చి మొక్కలతో నిండిపోయిన వీధి

నగరి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలో నిర్మించిన హౌసింగ్ కాలనీల్లో వసతులు కరువయ్యాయి. దీంతో లబ్ధిదారులు అక్కడ ఉండలేని పరిస్థితి. కాపురాలు పెట్టకుండానే కూలిపోయేలా మారిపోయాయి. నగరిలో నాగరాజకుప్పం-1లో 55కు గాను 54, నాగరాజకుప్పం-2లో 319కు గాను 313, కీలపట్టు-3లో 356కు గాను 317, ఏపీఐఐసీలో 196కు 193 కీళపట్టు-2లో 188కు గాను 176 గృహాలు పూర్తయినట్లు అధికారులు రికార్డుల్లో చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పూర్తిస్థాయిలో నివాసయోగ్యానికి అనువుగా ఉన్న ఇళ్లను వేళ్లమీద లెక్కించవచ్చు. ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వారు నాశిరకంగా పనులు చేపట్టారు. పైగా మౌలిక వసతులైన రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేదు. ఇక వీధులన్నీ పిచ్చి మొక్కలతో, పొదలతో నిండిపోయాయి. విషకీటకాలకు నిలయంగా మారాయి. ఒక్కో గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు మాత్రమే మంజూరు కావడంతో సిమెంటు రాళ్లతో గోడలు కట్టి మోల్డింగ్ వేసి వదిలేశారు. తర్వాత పూత పనుల ఊసేలేదు. ఆ నగదు చాలకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇక మెప్మా ద్వారా రూ.50వేల రుణం పొందిన లబ్ధిదారుల ఇళ్లు మాత్రం పూత పనులు పూర్తిచేసుకుని ఓ మాదిరిగా ఉన్నాయి. ఇక లబ్ధిదారులు సొంతంగా ఖర్చు పెట్టుకొని నిర్మాణాలు పూర్తి చేసుకోవాల్సిన పరిస్థిత నెలకొంది.

త్వరలో నిధులు

మౌలిక వసతుల కల్పనకు త్వరలో నిధులు మంజూరవుతాయి. మంజూరు కాగానే వసతులు కల్పిస్తాం. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- భాస్కర్, హౌసింగ్ ఏఈ

బదిలీ పోలీసులకు సన్మానం



బంగారుపాళ్యం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న సిబ్బందిని ఆదివారం సీఐ కత్తి శ్రీనివాసులు, ఎస్ఐ ప్రసాద్‌లు ఘనంగా సన్మానించారు. ఎస్సై వళ్లెమ్మ, కానిస్టేబుల్ ఉమాశంకర్, సురేంద్ర, అనితలను దుశ్శాలువలు కప్పి, పూలమాలతో సత్కరించి సన్మానించారు.

వేసవి శిక్షణ తరగతుల ఆరంభం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షనా తరగతులు ప్రారంభం అయ్యాయి. గిరిపేటలో ఇందిరా ప్రియదర్శిని, ఉషానగర్‌లో అనురాధ, సంతపేటలో కమల ప్రభల నేతృత్వంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. వేదం, ధ్యానం, యోగా, విలువలు, ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.